క్లుప్తంగా

వన మహోత్సవానికి మొక్కల పంపిణీ



మానవపాడు: మండల కేంద్రం, చెన్నిపాడు, అమరవాయి, పెద్దఆముదాలపాడు గ్రామాల్లో మంగళవారం వన మహోత్సవానికి మొక్కలను పంపిణీ చేసి నాటిస్తున్నామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నాటే ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనిల్‌కుమార్

గద్వాల: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనిల్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌తో నియామక పత్రాన్ని అందుకున్నారు. అనిల్‌కుమార్ బీజేపీలో క్రియాశీలకంగా ఉంటూ, పార్టీకోసం విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అనిల్‌కుమార్ నియామకంపై పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ అధికారికి మెమో జారీ చేస్తాం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో మంగళవారం గ్రామసభ ప్రత్యేక అధికారి వాహిదా ఖతూన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యుత్ సమస్యపై గ్రామప్రజలు అభ్యంతరాలు తెలిపారన్నారు. గ్రామంలో విద్యుత్ సరిగాలేదని, నివాస గృహాలపై విద్యుత్ తీగలు వెళ్లాయని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విద్యుత్ అధికారికి మెమో జారీ చేస్తామని తెలిపారు. గ్రామంలో ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ప్రజలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

గద్వాలన్యూటౌన్: తెలుగు, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ –ఏ గ్రూపులోకి మార్చాలని ముదిరాజ్ సభ సంఘం నాయకులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలుగు, ముదిరాజ్ కులస్తుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు కేటాయిస్తూ, చైర్మన్ నియమించాలని చెప్పారు. తెలుగు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు నర్సింహులు, కొత్తపాలెం సురేష్, హరి, సవారన్న, మహేష్, దౌలు, రవి ఉన్నారు.

అలంపూర్‌లో కొండచిలువ హల్‌చల్

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని పింజరి వీధిలో కొండచిలువ హల్‌చల్ చేసింది. సోమ వారం రాత్రి కరెంట్ పోయింది. ఆ సమయంలో కొండ చిలువ కాలనీలో చొరబడి కాలనీవాసులను ఇబ్బందలకు గురిచేసి ముళ్ల పొదల్లోకి జారుకుంది. కొండ చిలువ తన పిల్లతో పాటు కాలనీలోకి రావడంతో దానిని చంపేందుకు కాలనీవాసులు ప్రయత్నించడంతో పెద్దకొండచిలువ చెట్లపొదల్లోకి వెళ్లింది. చిన్న కొండచిలువలను కాలనీవాసులు చంపేశారు. కాలనిలో ముళ్లచెట్లు ఏపుగా పెరిగాయని, వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా, పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నూతన భవనం నిర్మించాలి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర కళాశాల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరిందని, వెంటనే నూతన భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాష డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివకుమార్, నవీన్, నరేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

'సాగు' యంత్రాలకు సబ్సిడీ ఏది?



గోకులపాడు శివారులో పొలం చదును చేస్తున్న రైతు

- రైతులకు అందని వ్యవసాయ పరికరాలు
- ఏళ్లుగా నిలిచిన ఆధునిక యంత్రాల పంపిణీ
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- యంత్రాలను అద్దెకు తెచ్చి సాగుచేస్తున్న వైనం



చెన్నిపాడు శివారు ప్రాంతంలో మిరప పంటను ఆరబెట్టిన రైతు

మానవపాడు: వ్యవసాయ యంత్రీకరణ పథకం అటకెక్కింది. పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వినియోగాన్ని పెంచి అన్నదాతకు కూలీల ఖర్చును తగ్గించడమే కాకుండా సమయాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వ్యవసాయ యంత్రీకరణ పథకం పత్తాలేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తుందని ఎదురుచూస్తున్నారు. వ్యవ సాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేసి తద్వారా అధిక దిగుబడి సా ధించి సాగును లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. రాయితీపై అందించే వ్యవసాయ పరికరాల పంపిణీ ఎన్నో ఏళ్లుగా నిలిచి పోవడంతో రైతులు సాగు సమయంలో యంత్రాలను అద్దెకు తెచ్చి సాగు చేసుకోవాల్సి వస్తోంది. గతంలో వ్యవసాయశాఖ తరుపున రైతులకు ఉపయోగపడే తైవాన్ స్ప్రేయర్లు, విత్తనాలు వెదజల్లే పరికరాలు, నాగళ్లు, నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్లు తదితర పరికరాలు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం రాయితీపై పరికరాలు అందించకపోవడంతో మండల రైతులు వాటికోసం ఎదురు చూస్తున్నారు.

నిత్యం అధికారులను సంప్రదించడం..

వ్యవసాయ పరికరాలు కోసం నిత్యం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించడం పరిపాటిగా మారింది. వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరే పరికరాలు అందించాలని కోరుతున్నారు.

గతంలో రాయితీపై అందించిన పనిముట్లు

మండలంలో గతంలో రైతులకు అవసరమైన పరికరాలు ప్రభుత్వం పంపిణీ చేసింది. మండలంలో తైవాన్ స్ప్రేయర్లు, ఇనుప నాగళ్లు, రోటోవేటర్, ట్రాక్టర్ నాగళ్లు, కోతయంత్రాలు, గడ్డి కట్టే యంత్రాలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా మండలంలోని రైతులు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అభ్యర్థిస్తున్న జిల్లా స్థాయిల్లోనే రాలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు, దృష్టి సారించి ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలను రైతులకు అందించాలని కోరుతున్నారు.

ప్రస్తుతం అమలులో లేదు..

వ్యవసాయ యంత్రీకరణ పథకం ప్రస్తుతం అమల్లో లేదు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, కల్టివేటర్లు, రోటోవేటర్లు, పవర్‌వీడర్, స్ప్రేయర్లు లాంటివి పరికరాలను ప్రభుత్వం ద్వారా అందించేది. ప్రస్తుతం రైతుల నుంచి వినతులు, డిమాండ్లు వస్తున్నాయి. ఈ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– సుబ్బారెడ్డి, వ్యవసాయ అధికారి, మానవపాడు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయాలి. రెండేళ్లుగా పరికరాల పంపిణీ నిలిచిపోవడంతో సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైతులకు ఎక్కువగా అవసరమైన నాగళ్లు, రోటోవేటర్, ట్రాక్టర్లు సబ్సిడీ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించాలని కోరుకుంటున్నాం. పండిన పంటను రక్షించుకోవడానికి రక్షణగా టార్పాలీన్ కవర్లు అవసరం, కానీ ఇంత వరకు ప్రభుత్వం అందిచలేదు. ప్రభుతం సబ్సిడీపై దృష్టి పెట్టి రైతులకు అందించాలని కోరుతున్నాం.

– భీమరాజ్, రైతు, గోకులపాడు

ప్రభుత్వం సబ్సిడీ పరికరాలు అందించాలి..



ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ పరికరాలు అందించాలి. ఇంతవరకు రైతులకు సబ్సిడీ పరికరాలు ఇవ్వకపోవడం విడ్డూరం. ప్రభుత్వ నిర్లక్ష్యమా? ఉన్నతాధికారుల నిర్లక్ష్యమో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి పరికరాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రఘువారెడ్డి, రైతు, మానవపాడు

ఎందుకు నిర్లక్ష్యం..



పంటలను సాగుచేసే యంత్రాలు సబ్సిడీ ద్వారా రైతుకు అందిస్తే లాభదాయకంగా ఉంటుంది. వ్యవసాయ యంత్రాలు ఉపయోగించడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. టార్పాలీన్లు సబ్సిడీ ద్వారా అందిస్తే మేలు. ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ పని ముట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రామాంజనేయులు, రైతు చెన్నిపాడు

ఘనంగా మొహర్రం ఉత్సవాలు



అలంపూర్‌లో సవారికి లేచిన అలెక్బర్ పీరు

అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో పీర్ల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అలెక్బర్ పీర్లచావిడిని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబ్ చేశారు. 8వ రోజు సోమవారం రాత్రి అలెక్బర్ సవారి లేచి పురవీధుల గుండా తిప్పారు. మంగళవారం రాత్రి పెద్దలాలీసాబ్, భైరంపల్లి లాలిసాబ్, హస్తం, గంధం పీర్లు సవారికి లేచి పట్టణంలోని పురవీధుల గుండా తిరిగాయి. నేటితో మోహరం ఉత్సవాలు ముగియ నున్నాయి. పీర్లను తుంగభద్ర నదిలో నిమజ్జనం చేయనున్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడికి నివాళి



నివాళులర్పిస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

గద్వాల: సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, విద్యుత్‌శాఖ సబ్‌ఇంజినీర్ సంజీవయ్యకు ఘనంగా నివాళులర్పించారు. గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సోమనాద్రి స్టేడియంలో ఏర్పాటు చేసిన సంజీవయ్య చిత్ర పటానికి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, వివిధ క్రీడా సంఘాల క్రీడాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్‌శాఖ ఉద్యోగులు క్రీడాకారులకు సంజీవయ్య కుమారుడు అక్షయ్ చేతుల మీదుగా ఉచితంగా ఫుట్‌బాల్ కిట్లను అందజేశారు. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు జగన్ ఉచితంగా క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సంజీవయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండల పాండు, సీనియర్ క్రీడాకారులు తిరుమల్, నవీన్, శివ, శ్రీధర్, రాజారెడ్డి, ఝడే శ్రీను, హలీం, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్యకర్తలకు ధైర్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

గద్వాల న్యూటౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గద్వాల నియోజకవర్గ నాయకులతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో మాట్లాడుతూ అన్ని గ్రామాలు తిరుగుతూ కార్యకర్తలకు ధైర్యం ఇవ్వాలని సూచించారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ, నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆంజనేయులుగౌడ్, నాయకులు బాసు హనుమంతు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కురువ విజయ్‌కుమార్, మోనేష్, తిరుమలేష్, బాసు గోపాల్, బసవరాజుతో పాటు పలువురు నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల తొలగింపు

మానవపాడు: కొంతకాలంగా గ్రామంలోని పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం పెద్దపోతులపాడు గ్రామంలో మెజార్టీ ప్రజల అభిప్రాయంతో తొలగించారు. ఎంపీడీఓ రమణరావు, పంచాయతీ సెక్రటరీ ఫయాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో 159 మంది మెజార్టీ ప్రజలు తీర్మానం మేరకు తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు ఉన్నారు.

రెస్టారెంట్‌లో చోరీ

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని బార్ అండ్ రెస్టారెంట్ చోరీకి గురైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. సత్యసాయి కాలనీలో స్వాగత్ బార్ అండ్ రెస్టారెంట్‌లో గుర్తు తెలియని దుండగులు తెల్లవారు జామున చొరబడి రూ.15వేల నగదు, 5వేల విలువైన మద్యం బాటిళ్లు అపహరించారు. ఉదయం సీసీ కెమెరాలో తనిఖీ చేయగా, రెస్టారెంట్‌లో చోరీ జరిగినట్లు గుర్తించారు. నిర్వాహకులు వేణు, నాగరాజులు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచాలి

గద్వాల క్రైం: జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు పూర్తి స్థాయిలో బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచాలని బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, రాంమాజనేయులు అన్నారు. మంగళవారం గద్వాల డిపో మేనేజర్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గట్టు, అయిజ, రాజోళి, ఉండవెల్లి, ఇటిక్యాల, అలంపూర్ తది తర ప్రాంతాల్లోని ప్రయాణికులు సైతం బస్సు సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సు సర్వీసుల ఏర్పాటు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, మానవపాడు శివారు ప్రాంతాలలో మంగళవారం ఎస్‌ఐ చంద్రకాంత్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నింబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్, లైసెన్స్ తప్పకుండా వాహనదారులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ఆర్టీసీకి 20 కొత్త బస్సులు ఇవ్వండి



గద్వాల న్యూటౌన్: గద్వాల ఆర్టీసీకి 20 కొత్త బస్సులు కేటాయించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. హైదరాబాద్‌లో మంత్రిని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రితో సమస్యను విన్నవించారు. గద్వాల నియోజకవర్గంలో కొన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సురక్షిత ప్రయాణంలో భాగంగా గద్వాల ఆర్టీసీకి 20 కొత్త బస్సులు ఇవ్వాలని కోరారు. కొత్త బస్సులు ఇచ్చేలా కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

ఉపాధ్యాయుల సంఖ్య పెంచండి



అలంపూర్: గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని గ్రామస్తులు కోరారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే విజయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థుల విద్యను దృష్టిలో ఉంచుకోని పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని కోరారు. గ్రామంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులతోపాటు గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



అలంపూర్: విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామ రైతులు అధికారులను కోరారు. అలంపూ ర్ మండలం కోనేరు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం వి ద్యుత్ సమస్యను పరిష్కరించా లని చౌరస్తాలోని ఏడీఈ కార్యాలయంలో ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్‌కు వినతి పత్రం అందజేశారు. కొంతకాలంగా కోనేరులో విద్యుత్ సమస్య వేధిస్తున్నట్లు వినతిలో పేర్కొన్నారు. పదే పదే విద్యుత్ అంతరాయం కలుగుతుండటంతో రైతులు, విద్యుత్ వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు నిలిచిన విద్యుత్ సరఫరా తిరిగి ఈ నెల 16వ తేదీన ఉదయం 5 గంటలకు పునరుద్ధించినట్లు తెలిపారు. రోజుల తరబడిగా విద్యుత్ అంతరాయం కలుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక విద్యుత్ అధికారులకు సూచించిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చిన్న కృష్ణయ్య నాయుడు, రైతులు చక్రపాణి రెడ్డి, మల్లెపోగు లక్ష్మణ్, కాంతా రెడ్డి, లక్ష్మణ్ రావు, సురేష్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, రాజా రమేష్, నరసింహారెడ్డి, వెంకట్ నాయుడు, రవి కుమార్, చిన్న పెంటన్న, రాఘవేంద్ర నాయుడు, శశికాంత్, విక్రంసింహారెడ్డి, నరసింహ, శేఖర్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల అర్బన్: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు చెక్కులను మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం ఎల్‌ఓసీలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు దౌలు, పాల్వాయి రంజిత్ కుమార్, ఆంజనేయులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



ర్యాలంపాడులో మొక్కలు నాటుతున్న మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న రాజోళి పోలీసులు

ధరూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి మొక్కలు నాటాలని మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ర్యాలంపాడు గ్రామ శివారులో 75వ వన మహోత్సవంలో భాగంగా ఆయన మాజీ సర్పంచులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చని చెట్టు ప్రగతికి మెట్లని, చెట్లను మనం నాటితే, అవి మనల్ని రక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, మాణిక్యరెడ్డి, యూత్ నాయకులు పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచులు అంపన్న, తిమ్మప్ప, దౌలన్న, నాయకులు రంగారెడ్డి, రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలు, గోవిందు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పోలీసులు

రాజోళి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీష్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణంలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయని, సకాలంలో వర్షాలు కురుస్తాయని, భవిష్యత్ తరాలకు ఆరోగ్య వాతావరణం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటితే ఆస్పత్రులకు వెళ్లే అవసరం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

గట్టు: రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని, పంటల సాగులో నిత్యం వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారు. మంగళవారం గొర్లఖాన్‌దొడ్డిలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్ర వేత్తల ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో పంటల సాగు, అధిక దిగుబడులపై సూచనలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాస్త్ర వేత్తల ద్వారా రైతులకు పత్తి, వరి పంటల్లో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, చీడపీడల నివారణపై ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్ర వేత్తలు సూచనలు ఇచ్చారు. రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తర్ణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బంగి ప్రియాంక

గద్వాల అర్బన్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని జిల్లా కేంద్రంలోని 15వ వార్డు కౌన్సిలర్ బంగి ప్రియాంక అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని గంజిపేటలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను కేంద్రాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజియా, మాధవి, షబ్బీర్, నజీర్, ఎక్బాల్ ఉన్నారు.

ధరూరు: 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కుర్వ వీధి సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులతో పాటు వారి పేరెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రాముఖ్యతను సెంటర్ టీచర్లు పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీరమ్మ, వజ్రమ్మ, రజీయ, జయమ్మలతో పాటు ఆయాలు పాల్గొన్నారు.

పదోన్నతులతో మరింత బాధ్యతలు



ఆలయ ఈఓ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న గోపి, మహేష్

జోగుళాంబ శక్తిపీఠం: ఉద్యోగులకు పదోన్నతులు అనేది వారిపై మరింత బాధ్యతలను పెంచుతున్నాయని అలంపూర్ ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో దశబ్దాల కాలంగా అంకితభావంతో సేవలందిస్తున్న అటెండర్ గోపి మరియు మహేష్‌లకు రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ.. మంగళవారం ఆలయ ఈఓ పురేందర్ కుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఇటీవల ఏడాది కిందట ప్రదీప్, శ్రీకాంత్‌లకు కూడా రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోకుండా అంకితభావంతో పనిచేసే వారిని గుర్తించామన్నారు. అందుకే ఉద్యోగులంతా అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులంతా క్లర్క్‌గా పదోన్నతులు అందుకున్న మహేష్, గోపిలకు అభినందనలు తెలిపారు.

ఆషాఢమాసంలో అమ్మవారికి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

రాజోళి: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో మహిళలు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తుంగభద్ర నది నుంచి నీరు తెచ్చి అమ్మవారికి అభిషేకాలు చేసి, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని పూజలు చేశారు.